# సాహసం



"రాధా!... రాధా!... ఎక్కడున్నావోయ్ పాపం మగపురుగు... ప్రొద్దునెళ్లి అలసిపోయి వచ్చాడు... రాగానే ఎదురొచ్చి కాఫీ ఇవ్వాలని లేదేమిటోయ్..." సోఫాలో కూర్చుని షూ విప్పుతూ అంటున్న మురళి ఎదురుగా కాఫీ కప్పుతో వస్తున్న శ్రీమతిని చూసి, నాలిక్కరచుకుని, "రేపు మనింటికి ఎవరొస్తున్నారో తెలుసా!" అన్నాడు మాటమారుస్తూ.

"అలా వచ్చీ రాగానే... షూ కూడా విడవకుండా అలా అరిచేయడమేనా?... మనమే కొత్తగా వచ్చామీ ఊరికి. ఇంతలో మనింటికొచ్చే గెస్టెవరట?" కుతూహలంగా అడిగింది రాధ.

"మా మేనేజర్ గారు, ఆయన మిసెస్, పిల్లలు... నేనే భోజనానికి ఆహ్వానించాను. నువ్వు వంట భలే చేస్తావుగా..., రుచి చూపిద్దామని...

నామని సుజనాదేవి

ఏమేం కావాలో చెబితే రేప్రొద్దుటే తెచ్చిస్తాను మధ్యాహ్నం నాతో లంచ్‌కి వస్తారు. ఓకేనా?" అన్నాడు మురళి.

"అతిథిదేవోభవ అన్నారు కదా! ఓకే... లిస్ట్ ఇస్తాను..." అంది రాధ.

తెల్లవారి రోజూకన్నా తొందరగా లేచింది. టిఫిన్, వంట కానిచ్చేసి శ్రీవారిని ఆఫీస్‌కి, పిల్లలను స్కూల్లకీ పంపించాక, రణరంగంలా ఉన్న ఇంటిని చక్కగా సర్దింది. సోఫాకి ఉన్న గలీబులు మార్చి, కొత్తగా బాంబే నుంచి కొని తెచ్చిన గలీబులు తొడిగింది. తుడుచుకుని ఎక్కడికక్కడ ముద్దలుగా పడేసిన టవల్స్ ఉతకడానికి వేసింది. షోకేస్‌లోని బొమ్మలను, షీల్డులనూ తీసి, దుమ్ముదులిపి నీట్‌గా సర్దింది. బెడ్‌పై బెడ్‌షీట్ తీసి, ఇటీవల బోలెడు డబ్బు పోసి కొన్న కొత్త బెడ్‌షీట్ పరిచింది. మ్యాచ్ అయ్యే పిల్లోకవర్స్ వేసింది. కొత్తగా కొనుక్కొచ్చి కట్టిన షాండ్లియర్‌ని దులిపింది. వాక్యూమ్ క్లీనర్‌తో ఇల్లంతా శుభ్రంగా క్లీన్ చేసింది. డైనింగ్ టేబుల్‌పై పరిచే షీట్స్ తీసి పరిచింది.

చకచకా ఫ్రైడ్ రైస్, పెద్దశనగలతో ఛాట్ మసాలా కూర, బఠాణీలు - గుత్తొంకాయ కుర్మా, టమాట చట్నీ, బంగాళదుంపవేపుడు, పెరుగు పచ్చడి చేసింది. పూరీలు చేసింది. పాయసం స్వీట్ చేసింది. పాపడ్స్, వడియాలు వేయించింది. స్పెషల్ ఐటమ్ కింద అన్నిరకాల వెజిటబుల్స్‌తో మంచూరియా చేసింది. ఫ్రూట్ సలాడ్ చేసింది. ఎంత త్వరగా చేసాననుకున్నా లంచ్ టైమ్ అవనే అయింది. వాళ్ళొచ్చేస్తారని వైట్‌రైస్‌కి కుక్కర్ పెట్టి, అన్ని డిషెస్ డైనింగ్ టేబుల్‌పై అందంగా సర్దింది. తమలపాకులు, వక్కపొడులతో కిళ్లీ కూడా సిద్ధం చేసింది. ఇల్లంతా మరోసారి సర్దుతూ ఊడ్చి, ఫ్రెషప్ అయి చీర మార్చుకునేసరికి శ్రీవారి దగ్గరనుంచి బైల్దేరామనే ఫోన్. ఇటీవల ప్రజెంటేషన్‌గా వచ్చిన అందమైన జగ్‌లో వాటర్‌పోసి, డిన్నర్ సెట్‌లోని గ్లాసెస్, ప్లేట్స్ తీసి తయారుగా ఉంచేసరికి కాలింగ్ బెల్ మ్రోగింది. చకచకా వెళ్ళి తలుపు తీసింది. భర్తతో పాటు ఒక భార్యాభర్తల జంట, ఇద్దరు పిల్లలు కనబడ్డారు. బహుశా వారే మేనేజర్ దంపతులు అయి ఉంటారనుకుంటూ, నమస్కారం పెట్టి లోనికి సాదరంగా ఆహ్వానించింది. ఆవిడ భారీ డిజైన్ ఉన్న ఖరీదైనచీర కట్టి, మెడనిండా బంగారు నగలతో ఎర్రగా, ఫుల్ మేకప్‌లో ఉంది. అతను అంత ఆడంబరంగా లేక పాంట్, ఫుల్ హాండ్స్ షర్ట్ నీట్‌గా టక్‌చేసుకుని, షూస్ వేసుకుని హుందాగా ఉన్నాడు. పిల్లలు కూడా ఖరీదైన బట్టల్లో ముద్దుగా ఉన్నారు.

ముందు హాల్‌లో కూర్చుని, పరిచయ కార్యక్రమం అయి, పిచ్చాపాటి నాలుగు మాటలు మాట్లాడాక, ఇల్లంతా చూపించి, టైం అవుతూండడంతో లంచ్‌కి ఆహ్వానించింది. వాష్ బేసిన్ దగ్గర చేతులు కడుక్కోగానే తెల్లటి మల్లెపూవు లాంటి టర్కీ టవల్ అందించింది.

భోజనం చేస్తూంటే కొసరి, కొసరి వడ్డించింది. నిజంగా వంటలు అద్భుతంగా ఉన్నాయని, చాలా శ్రమపడ్డారని మెచ్చుకున్నాడు మేనేజర్. ఆవిడ మాత్రం ఏమీ అనలేదు. పైగా అన్నం వదిలేసింది. కూరలు వేస్తుంటే వద్దనలేదు గానీ, అన్నీ సగం సగం తిని వదిలేసింది. పాపడ్స్, స్వీట్స్, మంచూరియా కూడా కొంచెం కొంచెం వదిలేసింది. పిల్లలు కూడా చాలా వేస్ట్ చేసారు. భోజనం కాగానే కిళ్లీ ఇస్తే తెగ సంతోషపడ్డాడు మేనేజర్. భోజనం అయ్యాక ఆవిడకి బొట్టు పెట్టి, రెండు జాకెట్‌పీసులు, పండు, తాంబూలం ఇచ్చింది. ఆ తర్వాత టైమ్ అవుతోందని వీడ్కోలు తీసుకొని వెళ్లిపోయారు వాళ్లు.

ఆవిడ, పిల్లలూ తిన్న ప్లేట్స్ తీస్తూంటే ప్రా

ణం ఉసూరుమంది. వెజ్‌మంచూరియా... ఎంత పెద్దపని? అంత కష్టపడినవన్నీ అలా ఎక్కువ ఎక్కువ వేసుకుని, వృధాగా కంచంలో వదిలేస్తే, ఈసురోమనిపించింది. "అన్నం పరబ్రహ్మ స్వరూపం, మెతుకు కిందపడకూడదు, వదలకూడదు" అంటూ చిన్నప్పటి నుంచి తమ ఇంట్లో ఎంత పద్ధతిగా పెంచారో, తనూ తన పిల్లలకి అదే నేర్పించింది. బయట అన్నం లేని వాళ్లెంత మందో ఉన్నారు.

సాయంత్రం అన్నీ కొంచెం కొంచెం పని మనిషి లక్ష్మికిచ్చింది.

* * *

తర్వాత కొన్నిరోజులకు మురళి కొలీగ్ వాళ్లింట్లో ఫంక్షన్ ఉంటే, భర్త బలవంతంపై వెళ్లింది రాధ. భోజనాలయ్యాక అంతా బయట కుర్చీల్లో కూర్చున్నారు. తాను కూడా కూర్చుంది. ఇంతలో లోపల తన హ్యాండ్‌బాగ్ మర్చిపోయిన విషయం గుర్తొచ్చి, తీసుకురావటానికి హాల్లో కెళ్లింది. తీసుకువస్తూంటే లోపలి రూమ్ నుంచి వినబడిన మాటల్లో తన పేరు వినబడటంతో ఆగింది.

'ఆ... ఆవిడే... మురళి మిసెస్ రాధ... ఆ... అందంగా ఉంటానని టెక్కు. మొన్న లంచ్ కి రమ్మని బలవంతం చేస్తే వెళ్లాం. వామ్మో... అన్నీ చూపించుకోవాలని ఎంత ఆర్భాటం చేసిందనుకున్నారు? వాళ్లకే అన్నీ ఉన్నట్లు... అంతా చిల్లరరకం. ఇక వంట చేసింది... ఏదో ఫైవ్‌స్టార్ లెవెల్‌లో అనుకుంది కానీ, నాకస్సలు తినబుద్ధి కాలేదంటే నమ్ము..." ఆ గొంతు మేనేజర్ మిసెస్‌ది.

ఇక వినబుద్ధి కాలేదు రాధకు. బాధనిపించి వడివడిగా వచ్చేసింది. తర్వాత పక్షం రోజులకు, "కొత్తగా ఎవరో కొలీగ్ ఆఫీస్‌లో చేరడానికి వస్తున్నారని, వచ్చినరోజే భార్యాభర్తలు ఏం వండుకుంటారులే అని మనింటికి భోజనానికి రమ్మన్నాను" అన్నాడు మురళి.

అనాసక్తంగా అనిపించింది రాధకు. ఆ రోజు విన్నమాటలు గుర్తొచ్చాయి. అందుకే ఇల్లు సర్దాలన్నా మనస్కరించలేదు. పైగా ఒంట్లో కూడా కొంచెం బాలేక పోవటంతో సర్దలేదు. వంటచేసేసరికి అంత టైం కూడా లేకుండా పోయింది. పోనీలెద్దూ... ఎవరింట్లోనయినా ఉండేవేగా సామాన్లు అనుకుని సరిపెట్టుకుంది. వంటలు కూడా అంత పెద్దగా స్పెషల్స్ ఏమీ తయారుచేయలేదు. మామూలు వంటలే చేసింది. కొంచెం స్వీట్ చేసి, పాపడ్స్, వడియాలు వేయించింది. ఇంతలో వాళ్లు రానే వచ్చారు. వాళ్లు రాగానే సాదరంగా ఆహ్వానించి, ఇల్లు చూపించి కాస్సేపు మాట్లాడుకున్నాక, భోజనాలు వడ్డించింది. ఒక గంటసేపుండి వెళ్లిపోయారు. వండింది చాలా ఎక్కువ ఉండేసరికి పని మనిషి లక్ష్మికి కొన్ని ఇచ్చింది.

రాధ కలివిడితనం వల్ల ఎవరినైనా ఇట్టే ఆకర్షించేది. ఆరోజు ఆఫీస్ తరపున అంతా కలిసి పిక్నిక్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసారు. అందరూ తప్పనిసరిగా సకుటుంబసపరివార సమేతంగా రావాలనటంతో ఆ ఒక్కరోజు ఎంజాయ్‌మెంట్‌కి అందరూ భార్యాపిల్లలతో వచ్చారు. మురళి, రాధ కూడా పిల్లలను తీసుకుని వెళ్లారు. అక్కడ అందరికీ తంబోలా గేమ్ పెట్టారు. పాటలు పాడించారు, పిల్లలతో డాన్సులు చేయించారు, చిట్టీలు వేసి, అందులో ఏది రాసి ఉంటే అది చేయాలని చేయించి, బాగా ఎంజాయ్ చేసారు. సాయంత్రం తిరిగి వచ్చేపుడు అంతా గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. ఇంతలో కొడుకు అభిలాష్ కనిపించకపోవడంతో వెదుక్కుంటూ బయల్దే

రింది. ఆరోజు తమ ఇంటికి వచ్చిన కొత్తకొలీగ్ సుబ్బారావు గారి మిసెస్, ఇంకా కొంతమంది నిలబడి మాట్లాడుకుంటున్నారు. వారికి కొంచెం దూరం నుంచి వెళుతూంటే తన పేరు వినిపించ డంతో ఆశ్చర్యంతో అలాగే ఆగిపోయింది.

“ఆ ... ఆవిడే మురళిగారి మిసెస్ రాధ... ఆ ... అందంగానే ఉంటుంది. ఏం లాభం?... ఇంటిపేరు కస్తూరివారు, ఇల్లంతా గబ్బిలాల కంపు అని... ఇంటికి భోజనానికి పిలిస్తే వెళ్లాం. ఇల్లే నీట్‌గా ఉంచుకోలేదు. ఎవరైనా వస్తున్నారంటే ఇంటిని ఎలా సర్దుకుంటాం? కానీ ఆవిడ అలా చేయదు. ఎవర్నైనా పిలిస్తే కొంచెం స్పెషల్స్ చేసి, గలేబులు అవీ ఛేంజ్ చేసి పైపై మెరుగులు దిద్ది ఇల్లంతా శుభ్రంగా సర్దుకోమా?... ఆమె బద్ధకస్తురాలు...” ఇంకా ఆమె ఏం అంటుందో వినే ఓపికలేక రాధ వడివడిగా అక్కడ్నుంచి వచ్చేసింది. ఈ లోగా 'అమ్మా' అంటూ మిగతా పిల్లలతో ఆడుతున్న అభిలాష్ వచ్చేసాడు. బస్ రావటంతో అంతా ఎక్కేసారు.

ఇంటికొచ్చాక అన్యమనస్కంగా ఉన్న రాధ ని...

'ఏం ఒంట్లో బాలేదా' అడిగాడు మురళి.

'ఒంట్లో కాదు... మనసే బాలేదు' అంది రాధ బాధగా.

'ఏంటోయ్... ఎవరైనా ఏమైనా అన్నారా...' అనునయంగా అడిగాడు మురళి.

ఈలోకంలో ఏం చేసినా తప్పే అయిపో తోంది. మీరు మీ మేనేజర్ వాళ్లని భోజనానికి పిలిస్తే, అంత కష్టపడి అవన్నీ చేసాను కదా! మెచ్చుకోమని నేనేమీ అనడం లేదు... మనస్సు నొచ్చుకునే విమర్శలు గుప్పించకుంటే చాలు. కానీ ఏమందో తెలుసా ఆవిడ? నేనంట... గొప్ప కోసం ఇల్లంతా అలంకరించి ఆర్భాటం చేసా నట. అది దృష్టిలో పెట్టుకొని, మొన్న సుబ్బా రావు గారు వాళ్లు వచ్చేముందు నాకు కొంచెం నలతగా కూడా ఉండడం చేత ఇల్లు అంతగా సర్దలేదు. ఆవిడేమందో తెలుసా? నేనట... ఇల్లంతా అపరిశుభ్రంగా ఉంచుకుంటానట. ఛీ... ఏం మనుషులు... ఒక మాట మాట్లాడే ముందు అది ఎదుటివారిని ఎంత బాధిస్తుందో అర్థం చేసుకోరేం?... ఛీ... ఛీ... ఇలాంటి వారి తో ఏం చేసినా, ఎలా చేసినా కష్టమే!'

అవును రాధా... వాళ్ల అలవాటే విమర్శించే అలవాటు. అలాంటప్పుడు నువ్వు ఎలాఉన్నా... ఏం చేసినా... విమర్శిస్తారు. అలాంటివారి గురించి ఆలోచించి, నీ మనస్సుని కష్టపెట్టు కుని నువ్వు బాధపడటం ఎందుకు చెప్పు? అలా బాధపడితే మనల్ని బాధపెట్టాలనుకున్న వారి లక్ష్యాన్ని మనమే సాధ్యమయ్యేలా చేసినట్లే. ఏ విషయమైనా మనం చూసే దృష్టిపైనే ఆధారపడి ఉంటుంది. దీనికి ఒక ఉదాహరణ చెబుతాను విను.

ఒక గాజు గ్లాసులో మంచినీళ్ళు, మరో గాజు గ్లాసులో ఆల్కహాల్ తీసుకొని రెండిటిలో రెండు పురుగులను వేస్తే, మంచినీటిలో వేసిన పురుగు మంచిగా ఈదుతూ నాట్యం చేసింది. ఆల్కహాల్‌లో వేసిన పురుగు గిలగిలా తన్నుకుని చనిపోయింది. దీనిని ఒక మంచి వ్యక్తికి, ఒక తాగుబోతుకీ చూపించి, 'దీని ద్వారా ఏ తెలుసుకున్నావు' చెప్పమంటే మంచివ్యక్తి, 'ఆల్క హాల్ తాగితే మనిషి శరీరం నాశనమై అలా మరణిస్తాడని తెలుస్తుంది' అని చెప్పాడు. కాని అదే ప్రశ్న తాగుబోతునడిగితే, ఆల్కహాల్ తాగితే కడుపులో ఉన్న పురుగులు చచ్చిపోతాయి అని చెప్పాడు. దీనిని బట్టి ఏం తెలుస్తుంది? ఏ

విషయం అయినా, వారు చూసే కోణంపైనే ఆధారపడి ఉంటుంది. పచ్చకామెర్ల వాడికి లోక మంతా పచ్చగానే కనబడుతుంది. అందుచేత ఇది మనసులో పెట్టుకుని బాధపడకు. మనకు తెలిసినంతవరకూ మనం అంతా మంచే చేసాం. ఒకరికి సహాయపడాలనే చేసాం. వాళ్లు ఆ రోజు అంత హడావిడిగా వచ్చి హోటల్‌లో ఏం తింటారని రమ్మన్నాను. మేనేజర్‌గారు భోజనప్రియులు కదా... నీ వంట రుచి చూపిద్దామని రమ్మన్నాను. ఇక బాధపడకు ఎవరేమైనా అనుకోనీ, సరేనా....' అని మురళి అనగానే, నిజంగానే మనసు తేలికయింది రాధకు. ప్రశాంతంగా నిద్రపోయింది.

తెల్లవారి పనిమనిషి లక్ష్మికి బదులు ఆమెకు బంధువయిన రావులమ్మ వచ్చింది. అప్పుడప్పుడూ లక్ష్మి ఊరెళ్ళినా, ఆరోగ్యం బాలేకపోయినా రావులమ్మ రావడం పరిపాటే. ఇద్దరివీ ప్రక్క ప్రక్క ఇళ్లే. ఒకరికి పని ఉండి రాలేకపోతే మరొకరిని పంపిస్తారు. ఇలా ఒకరికొకరు సహాయం చేసుకుంటారు.

'ఏమిటి రావులమ్మా... లక్ష్మికి ఆరోగ్యం బాలేదా... నువ్వొచ్చావు?' అంది రాధ అంట్లు బయటకు తెచ్చివేస్తూ.

'లేదమ్మా... బానే ఉంది... ఈరోజు వాళ్ళ ఊరెళ్లిందమ్మా. నన్ను ఈ ఒక్క రోజుకీ చూసుకోమంటే వచ్చానమ్మా....' అంటూ అంట్లు అందుకుంది.

'అమ్మా... మాలక్ష్మి ఎప్పుడూ మీ గురించే చెబుతుందమ్మా. మీరు చాలా మంచోరని... అందుకే తాను ఊరెళితే ఎవరింటికీ వెళ్లమని చెప్పకపోయినా మీకు మాత్రం కష్టం కలగొద్దని నన్ను వెళ్లమంటుందమ్మా...'

'ఎందుకో అంత ఇది?... నేనేం చేసానని...' అంది రాధ నవ్వుతూ.

> ఒక గ్రుడ్డు బయటి బలంతో పగులగొట్టబడితే ఒక జీవితం ముగిసినట్లు. కానీ అది లోపలి బలంతో పగిలితే ఒక జీవితం ప్రారంభమైనట్లు.
>
> * * *
>
> మనం ప్రతిరోజూ 'రేపటి సుఖం' కోసం ప్రయత్నిస్తుంటాం. కానీ ఆ 'రేపు' వచ్చినపుడు దానిని ఆనందించకుండా మళ్లీ 'రేపు' గురించి ఆలోచిస్తాం. ఇదే జీవితం అంటే...

'మరేమోనమ్మా... మీరు మంచిగా, ఆప్యాయంగా పలకరిస్తారంట... టీ ఇస్తారంట... అన్నీ పెడుతూ ఉంటారట. మొన్న రెండుసార్లు మీ ఇంట్లో ఎవరినో విందుకు పిలిచి ఆ వండినవి తనకి కూడా ఇచ్చారంట చూడండి... అబ్బో వాటి గురించి ఎన్నిసార్లు అందనుకున్నారు... వాయమ్మో... చాలా చాలా బావున్నాయి... ఆ అమ్మ చేయి చల్లని చేయి అందుకే ఏం చేసినా అమృతంలాగుంటుందని ఒకటే అనడం, ఎన్నిసార్లు తలచుకుంటుందో.... ఎప్పటికీ చెబుతుందమ్మా మీ గురించి...' రావులమ్మ మాటలు రాధకి చెవికెక్కడం లేదు... అదే విందుని వారు విమర్శించిన తీరు, వారి మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి. ఇపుడు ఈ మాటలు వింటుంటే ఎందుకో అరోజు కలగని తృప్తి ఇప్పుడు కలుగుతోంది. ఆరోజు వారికి వేడివేడిగా వడ్డించింది. చల్లారినవి, మిగిలినవీ ఇచ్చినా వీరెంత గుర్తుంచుకుంటారు? ఇద్దరికీ ఎంత తేడా ? అందుకే ఇస్తే ఇలాంటి వారికివ్వాలి... తల్చుకుంటారు అనుకుంది సంతృప్తిగా. రావులమ్మ తనధోరణిలో ఇంకా చెప్పుకుంటూ పోతూనే ఉంది.